
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 ఆగస్టు 2024



రామాపురంలో ముంపులోనే వరి చేలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కాకర్లమూడి శివారు రామాపురంలో పొలాల్లో వరద నీరు నిలిచిపోయి చేలు నాచు, పసర్లు కట్టి తెట్టలుగా దర్శనమిస్తున్నాయి. వర్షాలు తగ్గినా నేటికీ సుమారు రెండు వారాలుగా ముంపులోనే వరిచేలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాకర్లమూడి, విఎపురంలో సుమారు 240 ఎకరాలు పూర్తిగా నీట మునిగాయని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. సంతకోడు, లింగన్న కోడు, అయ్యప్ప కోడు, అస్వామ కోడు తదితర సాగు, మురుగు బోదెల ఆక్రమణల వల్లే తమ చేలు ముంపు బారిన పడ్డాయని ఆయకట్టు రైతులు అంటున్నారు.



కాకర్లమూడిలో వరి చేలల్లో పసర్లు

ఇళ్లు కట్టారు.. అప్పుల పాలయ్యారు..!

2014-19 మధ్యకాలంలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ఎదురుదెబ్బ

బకాయి బిల్లులు ఇవ్వకుండా పక్కన పెట్టిన వైసిపి ప్రభుత్వం

ఏలూరు జిల్లాలో రూ.46.69 కోట్ల బకాయి పెండింగ్

12,980 మంది లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరం

పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి

పాతబకాయిలు చెల్లిస్తామని సిఎం హామీతో అంతా ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం సాయం చేస్తుందని ఆశ పడ్డారు. ఉన్న ఇల్లు పడగొట్టి కొత్త ఇల్లు కట్టుకునేందుకు సిద్ధమయ్యారు. సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఉవ్విళ్లూరారు. తీరా ఇల్లు నిర్మించుకున్న తర్వాత ప్రభుత్వం నుంచి సాయం రాకపోవడంతో అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులంతా ఆర్థికంగా దెబ్బతిన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ఇళ్ల నిర్మాణాలకు తర్వాత అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఏర్పడిన పరిస్థితి ఇది. 2019కి ముందు టిడిపి ప్రభుత్వం ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం అమలు చేసింది. సొంత స్థలం, ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు రూ.లక్షా 50 వేలు వరకూ ఇచ్చింది. ఎస్‌సిలకు రూ.రెండు లక్షలు చెల్లించేలా ముందుకు సాగారు. దీంతో అప్పట్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పేదలు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు 32 వేల ఇళ్ల నిర్మాణం జరిగింది. అప్పట్లో నిర్మాణం జరిగిన ఇళ్లలో ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 12,980 ఇళ్లకు ప్రభుత్వం ఇస్తామన్న సాయం అందలేదు. అప్పట్లో ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల్లో కాలయాపన చేసింది. ఇంతలో 2019 ఏప్రిల్‌లో ఎన్నికలు వచ్చేశాయి. దీంతో బిల్లులు నిలిచిపోయాయి. ఎన్నికల్లో వైసిపి గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బకాయిలు ఇస్తామని జిల్లాకు చెందిన గృహనిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు అనేకసార్లు తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు మాత్రం జరగలేదు.



అప్పుల ఊబిలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు

అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులంతా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దాదాపు చేతికి రావాల్సిన రూ.లక్షా 50 వేలు రాకుండా పోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గడిచిన ఐదేళ్లుగా ఇళ్ల నిర్మాణం కోసం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో 2019కు ముందు నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు ఇవ్వాలని లబ్ధిదారులంతా కోరుతూ వస్తున్నారు. ఇటీవల సిఎం చంద్రబాబు గృహనిర్మాణ శాఖపై నిర్వహించిన సమావేశంలో 2014-19 మధ్య నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఏలూరు జిల్లాలో 12,980 మంది ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు రూ.46.69 కోట్లు రావాల్సి ఉందని జిల్లా అధికారులు లెక్కలు తేల్చి ప్రభుత్వానికి పంపించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదేస్థాయిలో ఇళ్ల బకాయిలు రావాల్సి ఉంది. ఆ సొమ్ములొస్తే అప్పులు కొంతమేర తీరే అవకాశం ఉందని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ముందుగా తమ బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు. అదే సమయంలో వైసిపి ప్రభుత్వంలో ఇళ్లనిర్మించుకున్న లబ్ధిదారులకు చెల్లించాల్సిన బకాయిలపై టిడిపి కూటమి ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందనే చర్చసైతం నడుస్తోంది. ఏలూరు జిల్లాలో 1698 మంది లబ్ధిదారులకు రూ.4.2 కోట్లు వరకూ బకాయిలు రావాల్సి ఉంది. పశ్చిమలోనూ బకాయిలు పెండింగ్ ఉన్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందా.. వైసిపి ప్రభుత్వం మాదిరిగా పక్కన పెడుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. తాము అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేశామని, బకాయిలు చెల్లించాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేసుకునేవారికి రూ.నాలుగు లక్షలు ఇస్తామని ప్రభుత్వం చెప్పడంపైనా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2019కు ముందు ఇళ్ల నిర్మాణ బకాయిలకు సంబంధించి ఏలూరు జిల్లా హౌసింగ్ పీడీని వివరణ కోరగా త్వరలోనే బకాయిల చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.

గోదావరి దోబూచులాట

నిలకడగా వరద - ముంపులోనే రహదారులు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

వరద గోదావరి 14 రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ దోబూచులాడుతోంది. బుధవారం భద్రాచలంలో 45 అడుగులకు చేరిన గోదావరి వరద నిలకడగా ఉంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఇప్పటికే గత 14 రోజులుగా మండలంలోని ప్రధాన రహదారులను వరద ముంచెత్తడంతో దాచారం-కుక్కునూరుపైనున్న 15 గ్రామాలు, ముత్యాలంపాడు-వింజరంపైన ఉన్న నాలుగు గ్రామాలు మొత్తం 19 గ్రామాలకు రాకపోకలు నిలిచేఉన్నాయి. గోదావరి వరదలు మండలాన్ని చుట్టుముట్టడంతో మండలంలోని గుమ్మగూడెం గ్రామానికి చెందిన 263 కుటుంబాలు, లచ్చగూడెం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు, వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామానికి చెందిన 200 కుటుంబాలు రావికుంట పునరావాస కాలనీలో తలదాచుకున్నారు. కుక్కునూరు ఎ-బ్లాక్‌కు చెందిన 30 కుటుంబాలు కివాక పునరావాస కాలనీలో ఉంటున్నాయి. గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో కౌండిన్యముక్తి గ్రామానికి చెందిన బాధితులు మద్రిపాడు పునరావాస కాలనీ నుండి తమ గ్రామాలకు చేరుకున్నారు. గోదావరి వరద తగ్గుతూ.. పెరుగుతూ దోబూచులాడుతుండటంతో పునరావాస కాలనీల్లోని వరద బాధితులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లోనూ అక్కడే ఉండే పరిస్థితి నెలకొంది. గోదావరి వరద పూర్తిగా తగ్గేవరకు పునరావాస కాలనీలో ఉన్న తమకు పనులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని, తమకు ఉపాధి హామీ పనులు చూపించాలని కోరుతున్నారు.



దాచారం-కుక్కునూరు మధ్య గుండేటి వాగు కాజ్‌పై ఉన్న వరద నీరు

వర్షాలు తగ్గినా వీడని ముంపు

నాచుగుంట క్వారీ మురుగుకాల్వపై తొలగని ఆక్రమణలు

రెండోసారి ముంపుతో రైతులు గగ్గోలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నాచుగుంట క్వారీ మురుగు బోదె కారణంగా బాదంపూడి నుంచి వెల్లమిల్లి వెంబడి వందలాది వరి పొలాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. ఇటీవల భారీ వర్షాలకు మురుగుకాలువ ఆక్రమణ వల్ల నీరు దిగువకు వెళ్లే దారి లేక పొలాలు నీట మునిగాయి. రెండు, మూడు రోజులుగా వర్షాలు లేకపోయినా క్వారీ మురుగుకాలువలో నీరు దిగువకు వెళ్లడం లేదని మళ్లీ తమ పొలాలు మునిగిపోతున్నాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాదంపూడి నుంచి జాతీయ రహదారిని ఆనుకుని నాచుగుంట వరకూ ప్రవహిస్తున్న నాచుగుంట క్వారీ మురుగు బోదె వెంబడి అక్రమ తూరలతో దారి వేయడంతో వెల్లమిల్లి, బాదంపూడి పొలాలు 450 ఎకరాలు ఇంకా ముంపులోనే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ శాఖ నిర్వహణా లోపం, ఆక్రమణలు తొలగించకపోవడం వల్లే ఏటా వందలాది ఎకరాల వరి పంట ముంపుబారిన పడుతోంది. బాదంపూడి మత్స్య కేంద్రం నుంచి 3.4 కిలోమీటర్ల పొడవునా నాచుగుంట వరకు మురుగు కాల్వ ఉంది. దీన్నే నాచుగుంట క్వారీ మురుగుబోదెగా పిలుస్తారు. ఈ బోదె స్టార్టింగ్ పాయింట్ వద్ద బాటం రెండు మీటర్లు వెడల్పు ఉంచి చివరి పాయింట్ వద్ద ఆరు మీటర్లు వెడల్పు ఉండాలి. బాదంపూడి వద్ద ఏలూరు కాలువ ఎస్కేప్, ప్రకాశరావుపాలెం తదితర ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరంతా ఈ మురుగుబోదె ద్వారా నాచుగుంట వద్ద జాతీయ రహదారి దిగువున అండర్ టన్నెల్ ద్వారా కొల్లేరులో కలవాల్సి ఉంది.

ఆక్రమణల వల్లే పొలాలు ముంపు

వెల్లమిల్లి, బాదంపూడి గ్రామాలకు చెందిన సుమారు 450 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో చేలల్లో అధిక వరద నీరంతా మురుగుకాలువలోకి వెళ్లాల్సి ఉంది. అయితే స్థాయికి మించి వరద నీరు ఈ మురుగుబోదెలోకి రావడం, ఆ నీరంతా దిగువకు వెళ్లే దారులు పూడిపోవడం, అనధికార ఆక్రమణలు, తూరలు పెట్టి దారులు వేయడం, గుర్రపుడెక్క, తూడు తొలగించే పనులను సకాలంలో డ్రెయినేజీ శాఖ చేపట్టకపోవడం వల్లే తమ పొలాలు ముంపుబారిన పడుతున్నాయని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బాదంపూడి వద్ద ముందుకు కదలని మురుగుబోదె

మా గోడు పట్టించుకునే వారు లేరు

సిహెచ్.అప్పారావు, రైతు, బాదంపూడి



ఏదోకసారి వరద ముంపు అంటే ప్రకృతి వైపరీత్యం అనుకోవచ్చు. అయితే వర్షాకాలంలో ప్రతియేటా మాకు పెద్ద సమస్యగా మారింది. బాదంపూడి నుంచి వెల్లమిల్లి రేవు వరకూ తూడు, గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోయింది. దీనికితోడు వెల్లమిల్లి రేవు వద్ద 20 టన్నుల లారీలు వెళ్లేందుకు మురుగుకాల్వపై ఓ వ్యాపారి తూరలతో పూడ్చారు. అందువల్ల నీరు ముందుకు కదలడం లేదు. ఆ నీరంతా మా పొలాల పైకి పొంగిపొర్లుతోంది. ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఎంఎల్‌ఎ ఆదేశించినా పట్టించుకోవడం లేదు.

వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కామవరపుకోట

వ్యవసాయ కార్మికులకు కేరళ తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా జరుగుతున్న ఆ సంఘం జిల్లా సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.మహంకాళిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం వచ్చి రెండు నెలలైందని, ఇప్పటికే ఆయన ఇచ్చిన హామీలపై కసరత్తులు చేస్తూ ప్రకటనలు కూడా చేశారని తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం కూడా పొందారన్నారు. అసెంబ్లీలో నిర్ణయాలు చేశారుగానీ కోటీ నలభై లక్షల మంది ఉన్న వ్యవసాయ కార్మికుల కోసం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి నిర్ణయం చేయలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించి విధి విధానాలను వెంటనే రూపొందించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో సంక్షేమ బోర్డు అమలు చేయాలని తమ సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పగించి ఉపాధి హామీ బడ్జెట్‌కు మాత్రం నిధులు పెంచకపోవడం సిగ్గు చేటన్నారు. ఉపాధి హామీ కూలీలు పని చేయడం లేదని దుష్ప్రచారం కూడా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పనిని ఉద్యాన తోటలకు అనుసంధానం చేస్తూ సంతకం చేశారని, దీనివల్ల వంద రోజులు ఉపాధి హామీ పనులు కుదించబడతాయని తెలిపారు. వలసలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ ల్యాండ్ చట్ట సవరణను ఈ ప్రభుత్వం రద్దు చేయడం లేదని, దీనివల్ల వ్యవసాయ కార్మికులు, దళితులు భూమి కోల్పోతారని, ఆ చట్ట సవరణను రద్దు చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తెచ్చి వారి బతుకులునే మార్పు చేయాల్సిన ప్రభుత్వాలు వారికి కనీస వేతనం వచ్చేలా కృషి చేయడం లేదని విమర్శించారు. వారికి మౌలిక సదుపాయాల కల్పన, పింఛన్ గ్యారంటీ ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు కోసం రానున్న రోజుల్లో పోరాడతామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు రాజమండ్రి దానియేలు, ఎం.సుధారాణి, యు.వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎ.ప్రభాకరరావు, పి.చంటి, జి.సత్యనారాయణ, ఎస్.సాయి, హోలీ మేరీ, సీత, కుమారి, ముత్తమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి

అంగన్వాడీ కేంద్రాల పిల్లలను తమ సొంత బిడ్డలుగా ఆదరించాలి

మధ్యాహ్న భోజనం పరిశీలన - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్యాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. బుధవారం ఆమె మండలంలో సుడిగాలి పర్యటన చేసి, పలు కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వాసుపత్రిని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, గాంధీనగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని, వెలగలపల్లిలోని వాటర్ ట్యాంకును సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. దీనిలో భాగంగా చింతలపూడి ప్రభుత్వాసుపత్రిని ఆమె పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. స్త్రీలు, పురుషులు, జనరల్, ప్రసూతి వార్డులను, ఆపరేషన్ థియేటర్, ఒపి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులతో సమావేశమై రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, ఆసుపత్రి స్థితిగతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. 50 పడకల ఆసుపత్రిని దీని స్థానంలోని వేరేచోట వంద పడకల ఆసుపత్రి నిర్మాణంలో ఉందని సూపరింటెండెంట్ వివరించారు. ఈ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను, 108, 104 వాహన నిర్వహణ, పారిశుధ్యం, మందులు, ఈ ఏరియాల్లో ఎక్కువగా నమోదయ్యే జబ్బుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డెంగీకి సంబంధించి ఆరు కేసులు నమోదయ్యాయని డిఎంహెచ్‌ఒ డాక్టర్ శర్మిష్ఠ తెలిపారు. టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలు, పాముకాటు కేసులు నమోదవుతుంటాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎమ్‌డి.రసూల్ కలెక్టర్‌కు వివరించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలాగా చర్యలు తీసుకోవాలని, శ్లాబ్ లీకేజీని అరికట్టడం తదితర అంశాలపై వైద్యాధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. చింతలపూడి నగర పంచాయితీ పరిధిలో పారిశుధ్యం నిర్వహణలో లోపాలున్నాయని పలువురు స్థానికులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ పారిశుధ్యం విషయంలో చాలా ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, వాటిని అధిగమనించడానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం నాణ్యత, మెనూ అమలవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో లైబ్రరీ, ప్లేగ్రౌండ్ గురించి ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక గాంధీనగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి అక్కడున్న బాలింతలకు బాలామృతం ప్యాకెట్లను అందజేశారు. పిల్లలతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. కలెక్టర్ వెంట నూజివీడు ఆర్‌డిఒ వై.భవానీశంకరి, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ రాజు, డిఇఒ ఎస్.అబ్రహాం, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, డిఎల్‌పిఒలు, ఇఒపిఆర్‌డిలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఓవర్‌హెడ్ ట్యాంక్ క్లీనింగ్, వాటర్ టెస్టింగ్, పారిశుధ్యం నిర్వహణా లోపాలపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను హెచ్చరించారు. ప్రగడవరం పంచాయతీ వెలగలపల్లి గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్, తాగునీరు, పారిశుధ్యాన్ని పరిశీలించారు. డ్రెయినేజీల్లో మురుగు నిల్వ ఉండటం, తాగునీటి ట్యాంక్ ఎప్పుడు క్లీన్ చేశారో వివరాలు లేకపోవడం, తాగునీటి పరీక్షలు చేయకపోవడంపై కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, పూర్తిస్థాయిలో పారిశుధ్యం, రక్షిత తాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఈ విషయంలో ఎటువంటి అలసత్వాన్ని సహించేంది లేదని స్పష్టం చేశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థతో మరింత మెరుగైన సేవలు

జెసి ధాత్రిరెడ్డి

ఏలూరు : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం ప్రజాపంపిణీ వ్యవస్థ బలోపేతం, నాణ్యమైన వస్తువుల పంపిణీ, ధరల స్థిరీకరణ తదితర అంశాలపై వివిధ తరగతుల ప్రజల నుండి అభిప్రాయాలను, వారి సమస్యలను జెసి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో ప్రజలకు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలకు బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు. నాణ్యమైన బియ్యం, నిత్యావసర సరుకులు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం ప్రయోజనాలు ప్రజలకు తెలియజేసి, వాటిని వినియోగించేలా అవగాహన కలిగించాలన్నారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద కచ్చితమైన తూకం ఉండేలా చూడాలన్నారు. దీనికోసం పౌర సరఫరాలు, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతలు అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహారం నాణ్యత తరచూ తనిఖీ అధికారులను ఆదేశించారు. సందర్భంగా ధాన్యం సేకరణలో మిల్లర్ల సమస్యలు, రేషన్ షాప్ డీలర్లు, ఎండియు వాహనదారుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ ఆర్‌ఎస్.సత్యనారాయణరాజు, పౌర సరఫరాల సంస్థ డిఎం మంజుభార్గవి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్ , విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్, ఏలూరు జిల్లా చాంబర్స్ అఫ్ కామర్స్ అధ్యక్షులు నేరెళ్ల రాజేంద్ర, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు కుమార్, రేషన్ షాప్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజులపాటి గంగాధర్, ఉపాధ్యక్షులు మరీదు వెంకటరావు, పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధమైన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

జెసికి ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ఆయా సంస్థలకు సహకరిస్తున్న విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ నేతలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో అనేక ప్రయివేట్ ఇనిస్టిట్యూట్లు అనుమతులు లేకుండా నడుపుతున్నారన్నారు. ఒక భవనంలో తరగతుల నిర్వహణకు అనుమతి తీసుకుని మరో రెండు భవనాల్లో విద్యాసంస్థలు నడుపుతున్నారని చెప్పారు. వాటిలోనూ కనీసంగానూ ప్రభుత్వ నిబంధనలు అమలు చేయడం లేదన్నారు. ఆర్‌ఆర్‌పేటలోని అక్షర పాఠశాల దీనికి నిదర్శనమని ఆరోపించారు. అనుమతుల్లేకుండానే 8, 9, 10 తరగతులను నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకటో తరగతి విద్యార్థికి జూనియర్ ఐఎఎస్, జూనియర్ ఐపిఎస్ సిలబస్ చెబుతామంటూ తప్పుడు ప్రచారం చేస్తూ సరైన అర్హతలు, అనుభవం లేని ఉపాధ్యాయులతో బోధన సాగిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణాధ్యక్షుడు బి.మనోజ్, కమిటీ సభ్యులు జయంత్ పాల్గొన్నారు.



జెసి ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరందించాలి

రాజుపేటలో రైతుసంఘం ఆధ్వర్యాన రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పెదపాడు

కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరు అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో రాజుపేటలో రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం ఆ సంఘం నాయకులు రాజుపేటలో సాగునీరందని వరి నారుమళ్లను, సాగు భూములను పరిశీలించారు. సాగునీరందక నారుమళ్లు బీటలు వారుతున్నాయని, నాట్లు ఆలస్యమవుతున్నాయని అన్నదాతలు వాపోయారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, మండల కార్యదర్శి గుండపనేని సురేష్ మాట్లాడారు. కృష్ణా డెల్టాకు శివారు ప్రాంతం కావడంతో సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నదుల్లో సమృద్ధిగా నీరున్నా పంటల సాగుకు మాత్రం సాగునీరు అందడం లేదని చెప్పారు. కృష్ణా మెయిన్ కెనాల్‌కు తగినంత నీరొదిలి శివారు ప్రాంత భూములకు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, చెత్తాచెదారం తొలగించే చర్యలు కూడా చేపట్టాలన్నారు. మండలంలోని రాజుపేట, వసంతవాడ, గోగుంట, తోటగూడెం, నాయుడుగూడెం తదితర గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. భూములు దమ్ము చేసుకుని నాట్లు వేసుకునేలా తగినంత నీరందేలా కృష్ణా ఏలూరు కాలువకు నీరొదలాలని కోరారు. సాగునీరిచ్చి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలురైతులు పాల్గొన్నారు.



సాగు నీరందని చేల వద్ద రైతులు, నేతల ఆందోళన

విధుల్లోకి తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం రూరల్

తమను విధుల్లోకి తీసుకోవాలని ఐటిడిఎ కోట రామచంద్రపురంలో నియమించిన కోయ భారతి ఎంటిటి ఎంఎల్, టీచర్స్ కోరారు. ఈ మేరకు ఐటిడిఎ డీడీ, ఎంఎంను సిరామయ్యను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఐటిడిఎ ఎంటిటి ఎంఎల్‌లను అన్ని స్కూల్లోనూ పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిరామయ్య మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీ నుంచి విధుల్లోకి తీసుకుంటామని చెప్పారు. దీంతో మాతృభాష ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, కుంజా నవీన్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న టీచర్స్

ఏలూరు కమిషనర్‌గా చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటకృష్ణ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో గతంలో పనిచేసిన చంద్రశేఖర్‌ను కమిషనర్‌గా ఎఫ్ఎసి హోదాలో నియమిస్తూ బుధవారం సిడిఎంఎ ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రశేఖర్ ప్రస్తుతం ఇదిలో వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

అక్రమ తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం టూరింగుపేటలో హిందూ శ్మశాన వాటిక స్థలంలో సిమెంటురోడ్డు - పంట బోదె మధ్యలో ఉన్న మట్టిని అక్రమంగా జెసిబితో తవ్వి ట్రాక్టర్లపై తరలిస్తుండగా గ్రామస్తులు మంగళవారం సాయంత్రం అడ్డుకున్నారు. అనంతరం పంచాయతీకి సమాచారం ఇచ్చారు. కార్యదర్శి ఇవ్వాని నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి సూరత్తుల దుర్గాదేవి ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనుమతులు లేకుండా ఎందుకు తవ్వుతున్నారని జెసిబి డ్రైవర్‌ను సెక్రటరీ ప్రశ్నించగా ట్రాక్టర్ లుక్కు చెందిన వ్యక్తి తవ్వమని ఇక్కడ తవ్వి కొత్త ఉంగుటూరులో సమాధుల పక్కన క్వారీ గోతిని పూడ్చమన్నారని చెప్పారు. మట్టి తవ్వేస్తే సిమెంటు రోడ్డు బలహీనపడి ప్రమాదాలు సంభవిస్తుంటాయని, అక్రమ తవ్వకాలు, అందుకు కారకులపై చర్యలు తీసుకోవాలని యువకులు పట్టుపట్టారు. వాహనాలను ఆపి కొంతసేపు ఆందోళన, ధర్నా నిర్వహించారు. యంత్రాలను ఆపి వాటిని స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసే మని కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. టిడిపి గ్రామ అధ్యక్షుడు సప్పా వీరబాబు, నాయకులు నల్లా ఆనంద్, గంటా యువరాజ్, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.

యుటిఎఫ్ మండలాధ్యక్ష కార్యదర్శులుగా లక్ష్మి, అజరయ్య

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

యుటిఎఫ్‌లో ఒక మహిళను మండలాధ్యక్షురాలిగా ఎంపిక చేయడం ఎంతో అభినందనీయమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు బి.సుభాషిణి అన్నారు. యుటిఎఫ్ ఆగిరిపల్లి మండలాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కెవిడి.లక్ష్మి, కె.అజరయ్య ఎన్నికైనట్లు యుటిఎఫ్ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లి యుటిఎఫ్ భవనంలో నిర్వహించిన నూతన కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌కె.ముస్తాఫా అలీ, ఆర్.రవికుమార్, జి.విరాంగమోహన్, జిల్లా కార్యదర్శి బి.అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


లక్ష్మి


అజరయ్య

నాగరాజుకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎఎల్ఎంగా పనిచేస్తున్న మరీదు నాగరాజు ఎల్ఐగా నారాయణపురం విద్యుత్ ఉపకేంద్రం (ఎస్ఎస్) లైన్‌మెన్‌గా విధుల్లోకి చేరారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ ఎఇ శ్రీరామ్, ఉద్యోగులు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన లైన్‌మెన్లు అభినందనలు తెలిపారు. నాగరాజు 2007లో ఉద్యోగంలోకి చేరినప్పటి నుంచి మధ్యలో కొన్ని రోజులు నిడమర్రు మండలంలో పనిచేసి మిగతా సర్వీసు అంతా ఉంగుటూరు మండలంలోనే నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందటం అభినందనీయమని ఎఇ శ్రీరామ్ అన్నారు.


నాగరాజుకు ఆర్డర్ కాపీ ఇస్తున్న ఎఇ

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర, కామర్స్ సబ్జెక్టుల్లో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీ 55 శాతం ఉత్తీర్ణత కలిగి ఉన్న అర్హులైన అభ్యర్థులు ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, తరువాత మౌఖిక పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. నెట్, సెట్, పిహెచ్‌డి అర్హతలు కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు కళాశాల సూపరింటెండెంట్ చంద్రమోహన్ 9989929534, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జి.శ్రీనివాసరావు 8500284838 సంప్రదించాలని తెలిపారు. .

ఏలూరు డిఎస్‌పిగా శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు డిఎస్‌పిగా డి.శ్రావణ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ పలు ప్రాంతాల్లో డిఎస్‌పిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన చిత్తూరు జిల్లా పోలీస్ ట్రైనింగ్ కార్యాలయం డిఎస్‌పిగా పనిచేస్తుండగా సాధారణ బదిలీలో భాగంగా ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా బదిలీ అయ్యారు.


శ్రావణ్‌కుమార్

రాజు మృతిపై దర్యాప్తు కోరుతూ వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని శ్రీనివాసపురంలో ఈ నెల 13వ తేదీన జరిగిన ముప్పిడి రాజు హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని మృతుని తల్లిదండ్రులు ఎస్‌పి, మరియమ్మ కోరారు. ఈ మేరకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్, జనసేన చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఎం.ఈశ్వరయ్యకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జె.శ్రీనివాస్, కొమ్ముకూరి సరోజిని, యడ్లపల్లి సాయమ్మ, జుజ్జవరపు లక్ష్మి ఉన్నారు.

వంగతోట పరిశీలన

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన ఎర్ర సీతారామయ్య వంగతోటను ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ బుధవారం పరిశీలించారు. ఎర్ర సీతారామయ్య వేసిన వంగ తోటలో పూత, పిందె రావట్లేదని ఉద్యాన శాఖాధికారికి తెలియజేయగా ఆ తోటను పరిశీలించారు. పూత, పిందె రావటం గమనించి రైతుకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

8న పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చాట్రాయి

ఈ నెల ఎనిమిదో తేదీన మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు చాట్రాయి ఎంఇఒ ఎస్‌ఎస్.బ్రహ్మాచారి తెలిపారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకుని పాఠశాలలను అభివృద్ధి చేసే వ్యక్తిని ఎన్నుకుంటారన్నారు. ఈ నెల ఐదో తేదీన పాఠశాల బోర్డులో ఓటర్ల లిస్టు పెట్టనున్నామని, ఐదో తేదీన తుది జాబితా ఇస్తామని, ఎనిమిదో తేదీన ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

ప్రభాకరబాబుకు అభినందన సభ

ప్రజాశక్తి - కలిదిండి

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరని, విరమణ లోపు చేసే సేవలు నిలిచి ఉంటాయని జిల్లా విద్యా శాఖాధికారి అబ్రహం అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఎంఇఒ పిడుగు ప్రభాకరబాబుకు స్థానిక కల్యాణి ఫంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం జ్ఞాపిక అందించి ఘనంగా సన్మానించారు.

వరుస పద్ధతిలో వరి నాట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో ప్రకృతి వ్యవసాయ సిఆర్‌పి గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో పొలంలో వరుస పద్ధతిలో వరి నాట్లు బుధవారం వేయించారు. ముందుగా బీజామృతంతో నారుకు శుద్ధి చేసి, కొన్ని తీసుకుని మొక్కకు మొక్కకు మధ్య అడుగు దూరం ఉండేలా రైతు బూరుబోయిన సుధాకర్ పొలంలో నాట్లు వేయించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పద్ధతిలో సాగు చేయడం వల్ల చీడపీడల నివారణకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ అజయ్, ఫ్లవర్, రైతులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - మండవల్లి

పెన్షన్‌దారులు అందుబాటులో ఉండి పెన్షన్ పొందే విధంగా సిబ్బందికి సహకరించాలని ఎంపిడిఒ బేబీ శ్రీలక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బుధవారం మాట్లాడారు. ఆగస్టు ఒకటో తేదీన మండలంలోని 6946 మందికి పెన్షన్ అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు .


బకాయి సొమ్ము చెల్లించాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండలం గవరవరం పాత వర్జీనియా పొగాకు వేలం కేంద్రం గోడౌన్ల వద్ద రైతుల నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. మొక్కజొన్న పంటను అమ్మగా వచ్చిన బకాయి సొమ్ములు చెల్లించాలంటూ పోలవరం మండలానికి చెందిన రైతులు ధర్నా చేపట్టారు. సుమారు రూ.మూడు కోట్ల విలువైన మొక్కజొన్న పంటను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి ఆ డబ్బు వెనక్కి ఇవ్వలేదని రైతులు వాపోయారు. ధర్నాలో పాల్గొన్న రైతులకు పోలవరం మాజీ ఎంఎల్‌ఎ మోడియం శ్రీనివాస్, సిపిఎం మండల కార్యదర్శి సుక్లబోయిన రాంబాబు సంఘీభావం తెలిపారు.

రైతులకు న్యాయం చేయాలి

పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసి రైతులను మోసగించిన దళారులపై కఠిన చర్యలు తీసుకుని మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కొయ్యలగూడెంలో బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.


పొగాకు వేలం కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

పోలవరం మండలంలో పలు గ్రామాల్లో రైతుల నుంచి మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేసి నెలలు గడుస్తున్నా దాదాపు రూ.3.5 కోట్లు చెల్లించకుండా మోసం చేయడం దారుణమని విమర్శించారు. కొయ్యలగూడెంలో రైతులు చేస్తున్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున సంఘీభావం ప్రకటించారు. బాధిత రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ధాన్యం, మొక్కజొన్న బకాయి సొమ్ములు రైతులకు అందించి మోసగించిన దళారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరం

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం టౌన్ :విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలంటే నేర్చుకోవాలనే తపనతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరమని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణంలో దామోదర సంజీవయ్య ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు బుధవారం పాఠ్య, నోటు పుస్తకాలు ఎంఎల్‌ఎ చేతులమీదుగా బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయం కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా ప్రవర్తనతో పాటు, మంచి జ్ఞానం కలిగి చదవాలని కోరారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ఎంఎల్‌ఎను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ప్రభాకరరావు, టిడిపి జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో జరిగిన బెడ్ షీట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ


పుస్తకాలు అందిస్తున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

ఆసుపత్రిని పరిశీలించారు. అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు నుంచి వచ్చిన వరద బాధితులను, గర్భిణులను వారికి అందుతున్న పోషకాహారాలు, వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుతో వీడియో కాల్ మాట్లాడి పోలవరం నిర్వాసిత గర్భినులతో మాట్లాడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఉపాధి కూలీల బకాయి వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, బికెఎంయు ఏలూరు జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, బికెఎంయు మండల సమితి సమావేశం గుడిముడి పాపారావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వసంతరావు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా పని అడిగిన కూలీలందరికీ పని చూపించాలన్నారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని, రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు మూడు నెలల నుంచి ఉపాధి హామీ కూలీలకు వేతనాలు అందడం లేదని, వాటిని వెంటనే విడుదల చేసి పేదలను ఆదుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన గ్రామాలను అధికారులు సందర్శించి వారిని ఆదుకోవాలని, వారికి నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. మునిగిపోయిన పంట పొలాలకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో ఇళ్ల స్థలాలు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, అర్హులందరికీ మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు గుర్తించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం మంజూరు కోసం వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో వీరంకి వెంకట్రావు, పిల్లి సత్యనారాయణ, సురేష్, పాపారావు, దుర్గమ్మ, పార్వతి పాల్గొన్నారు.

కెడిసిసి బ్యాంకులో తక్కువ వడ్డీతో అధిక రుణాలు

చీఫ్ మేనేజర్ తలారి వెంకటరంగప్రసాద్

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ భూమిని బట్టి తక్కువ వడ్డీతో ఎంతోమంది రైతులకు కెడిసిసి బ్యాంకు రుణ సౌకర్యం కల్పిస్తుందని ఆ బ్యాంకు చీఫ్ మేనేజర్ తలారి వెంకటరంగప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల కేంద్రమైన ముసునూరులోని కెడిసిసి బ్యాంకు పరిధిలో మండలంలోని 16 గ్రామాలు, వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ పరిధిలోని పలు గ్రామాలతో కలుపుకుని వ్యవసాయ భూముల మీద స్వల్పకాలిక రుణాలు, మధ్యకాలపు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. క్రాప్ లోన్లు, దీర్ఘకాలపు రుణాలైన ఎల్‌టి లోన్లు కర్షక మిత్ర, రైతు నేస్తం, ట్రాక్టర్లు, ఎడ్ల బండి, కోళ్ల ఫారం, పందులు పెంపకం, గేదెలు, మేకలు, గొర్రెల పెంపకంపై రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ఏడు సొసైటీ పరిధిలో రూ.వందల కోట్లు టర్నోవర్ అవుతుందని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రుణ సౌకర్యంతో పాటు, వ్యాపార అభివృద్ధికి కూడా రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నెల నెలా, త్రైమాసిక, ఆరు మాసాలకు, సంవత్సరానికి ఒకసారి వడ్డీతో పాటు అసలతో పాటు కొంత నగదు బ్యాంకులో జమ చేసే విధంగా రైతులకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు.


వెంకటరంగప్రసాద్

నేరాలు - ఘోరాలు

మానవ అక్రమ రవాణా కలకలం

పోలీసుల అదుపులో ఏడుగురు బాలలు, నలుగురు వ్యక్తులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవ అక్రమ రవాణా కేసులో ఏడుగురు బాలలను, మానవ అక్రమ రవాణా దారులుగా అనుమానిస్తున్న నలుగురు వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం ఏలూరులో చోటు చేసుకుంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్య చక్రవేణి తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం ఏలూరు రైల్వే స్టేషన్ల మధ్య నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా 18045 నెంబరు ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో తుని స్టేషన్ వద్ద ఏడుగురు బాలలను అనుమానాస్పదంగా రైలులో తిరగడం గుర్తించారు. రైల్వే పోలీసులు వారిని ఏలూరు రైల్వే స్టేషన్‌లో దింపి బాల్ బచావో ఆందోళన్ టీమ్‌కు, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించగా వారు వచ్చి విచారించారు. నలుగురు అనుమానాస్పద వ్యక్తులతో పాటు నిజామాబాద్, సికింద్రాబాద్ వెళ్తున్నట్లు గుర్తించారు. వారు తెలిపిన అడ్రస్సులు, కారణాలు అనుమానాస్పదంగా ఉండటంతో కేసు నమోదు చేసి వారిని స్థానిక శనివారపుపేటలోని బాలుర వసతి గృహానికి తరలించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో తదుపరి విచారణ నిర్వహించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం వారి వారి రాష్ట్రాలకు వారిని పంపిస్తామని సూర్య చక్ర వేణి తెలిపారు. పట్టుబడినవారిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కుమార్‌షేక్ (13), ఆశిష్‌మొండల్ (6), సబీర్ షేక్ (16), ప్రకాష్ తిర్ల (15), బీహార్‌కు చెందిన శివరాజ్ (15), అంకిత్‌కుమార్ (16), ఒడిశా రాష్ట్రానికి చెందిన షేక్ రిహాన్ రజాక్ (14) ఉన్నారు. అక్రమ రవాణా దారులుగా అనుమానిస్తున్న వారిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసిత్ దాస్ (33), అజారుద్దీన్ షేక్ (30), ఒడిశాకు చెందిన షేక్ ముజారుద్దీన్ (22), బీహార్‌కు చెందిన కుందన్ పస్వాన్ (24) ఉన్నారు. వీరిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.


పోలీసుల అదుపులో ఉన్న బాలలు, వ్యక్తులు

ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడి వ్యక్తి మృతి

టి.నరసాపురం :పొలంలో దమ్ము చేస్తుండగా అదుపు తప్పి ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బండివారిగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బండివారిగూడెం గ్రామానికి చెందిన పోకల సుబ్బారావు(51) తన వ్యవసాయ భూమిలో వరినాట్లు వేయించడానికి ట్రాక్టర్ ఇంజన్‌తో దమ్ము చేస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. సుబ్బారావు ట్రాక్టర్ కింద పడడంతో తీవ్ర గాయాలపాలవ్వడంతో బంధువులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుమారుడు అంజిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - దెందులూరు

దోమ అత్యంత ప్రమాదకరమైన కీటకమని, దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు సెంట్ జేవియర్ ఉన్నత పాఠశాలలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దోమ చిన్న కీటకమైనప్పటికీ దాని ద్వారా ప్రమాదకరమైన అంటువ్యాధులు, డెంగీ, మలేరియా, చికెన్ గున్యా సంక్రమిస్తాయని తెలిపారు. విద్యార్థులు దోమకాటుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నరసింహరావుపేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రగతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత ఆచరించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల డయేరియా, విరేచనాలు, కామెర్లు, టైఫాయిడ్, నులిపురుగు తదితర వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. జె.గోవిందరావు మాట్లాడుతూ మనకు ఎక్కువగా హాని చేసే మలేరియా, డెంగీ దోమలు మన గృహాలు, గృహ పరిసరాలు ఉండే మంచి నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని తెలిపారు. వారానికి ఒకసారి మంచి నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. దానిలో విద్యార్థుల పాత్ర కీలకమని సూచించారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హేమ, హెల్త్ అసిస్టెంట్స్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశా కార్యకరలు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అందుబాటులోకి తెస్తాం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

అందరికీ ఇసుక అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇసుక విధానంలో లోపాలు సరిచేసేందుకు అధికారులకు సూచనలు ఇస్తామని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ హామీ ఇచ్చారు. టిడిపి పట్టణ కార్యాలయంలో ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్‌ను శ్రీబాలాజీ తాపీ పనివార్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం కలిసి జంగారెడ్డిగూడెం డివిజన్‌లో ఇసుక సమస్య వివరించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొపిశెట్టి వెంకట సూరిబాబు, ప్రధాన కార్యదర్శి మామిడి రాము మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం డివిజన్‌లో అధికారులు ఉచిత ఇసుక విధానానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. 50 రోజులుగా ఇసుక లేకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయి, తాపీ మేస్త్రీలతో పాటు తాపీ పనివారలు, వడ్రంగి, ఎలక్ట్రికల్, రాడ్ బెండర్స్, పెయింటర్స్, సెంట్రింగ్ తదితర 33 రకాల భవన నిర్మాణ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని వివరించారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌కు గోదావరి ఇసుక తక్కువ ధరకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ సమస్య త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బాలికలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని బాలికల సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా నిరోధక చట్టం, గృహ హింస నిరోధక చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టం గురించి వివరించారు. విద్యార్థి దశలోనే బాలికల అక్రమ రవాణాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇబ్బందులు ఎదురైతే ముందుగా తల్లిదండ్రులకు, తరువాత టీచర్లకు, అయినా సమస్య పరిష్కారం కాకుంటే పోలీసులను సంప్రదించాలన్నారు. వివాహ అనంతరం మహిళలపై గృహహింస కొనసాగితే అందుకు బాధితులైన మహిళల పట్ల కోర్టులు అండగా నిలుస్తాయన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్య ప్రకాష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతుల కోసం పోరాటం : పిఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - నూజివీడు

హాస్టళ్లలో ఉండే విద్యార్థుల వసతి సౌకర్యాల మెరుగు కోసం నిరంతరం పోరాడతామని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పిఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కార్యదర్శి డి.శివ కుమార్ అన్నారు. పిఎస్‌ఎఫ్‌ఐ నూజివీడు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూజివీడు పట్టణంలోని ఐదో వార్డు పరిధిలోని ఎంప్లాయీస్ కాలనీలో ఉన్న శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాల వసతి సౌకర్యాల్లో అధ్వానంగా ఉందన్నారు. వారం రోజుల్లో పరిశుభ్రమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు హాస్టల్ పరిసరాలను పరిశుభ్రం చేయకపోతే పోరాటం చేస్తామన్నారు.